## క్లుప్తంగా

### ఆన్‌లైన్ దరఖాస్తు గడువు పెంచాలి

**అలంపూర్:** రాష్ట్ర ప్రభుత్వం కుల వృత్తుల అందజేయనున్న ఆర్థిక సాయం కోసం దరఖాస్తు గడువును పెంచాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 20 వరకు గడువు ఉండటంతో చాలా మంది పేదలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు పొందడానికి తహసీల్దార్ కార్యాలయం, మీ–సేవా కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారని వివరించారు. దీంతో సర్వర్లు పని చేయక సకాలంలో ధ్రువీకరణ పత్రాలు అందడంలేదని వాపోయారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల చివరి వరకు గడువు పెంచాలని కోరారు.

### బాధిత కుటుంబానికి పరామర్శ

**మల్దకల్:** మండలంలోని నాగర్‌దొడ్డి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తిమ్మప్ప అన్న కుమారుడు చంద్ర అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి గ్రామానికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట గ్రంథాలయ జిల్లా చైర్మన్ జంబు రామన్‌గౌడ్, ఎంపీపీ రాజారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, పెద్దవీరన్న, సవారన్న, వెంకటన్న, నర్సింహారెడ్డి, నరేందర్, పాల్గొన్నారు.

### మట్టిఎద్దుల ఊరేగింపు



**కేటీదొడ్డి:** మండలంలోని కుచినెర్లలోని మట్టి ఎద్దుల అమావాస్య సందర్భంగా సోమవారం శంబులింగస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మట్టి ఎద్దులను గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ రామకృష్ణనాయుడు, సర్పంచ్ హైమావతి, ఉప సర్పంచ్ నర్సప్ప, ప్రసాద్‌గౌడ్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

### వాల్‌పోస్టర్ విడుదల

**గద్వాల అర్బన్:** టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కొదండరాం అక్కంపేట నుంచి చేపట్టిన తెలంగాణ బచావో యాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను తెలంగాణ జన సమితి జిల్లా కన్వీనర్ అలూరు ప్రకాష్ గౌడ్ ఆవిష్కరించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆయన విడుదల చేసి మాట్లాడారు. యాత్రలో కార్యకర్తలు, విద్యార్థులు, మేధావులు, కర్షకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వీరభద్రప్ప, వీరేష్, మహబూబ్ పాషా, రాజు, కిరణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

### మొర్రం తరలించకుండా చర్యలు తీసుకోవాలి

**ఉండవెల్లి:** మండలంలోని ప్రాగటూరు, శేరుపల్లె గ్రామాల శివారులోని మొర్రంను అక్రమంగా తరలిస్తున్నారని సోమవారం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. ఈ విషయం రెవెన్యూ సిబ్బందికి తెలవడంతో ఆర్ఐ రాజేష్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. అప్పటికే ట్రాక్టర్లు, పొక్లెయిన్ వాహనాలు వెళ్లిపోయాయని గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికైనా మొర్రం తరలించకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఆర్ఐకి విన్నవించారు. తహసీల్దార్‌ను వివరణ కోరగా అనుమతులు లేకుండా ఎవరైన మొర్రం తరలిస్తే వాహనాలు సీజ్ చేస్తామని పేర్కొన్నారు.

### ఘనంగా వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠాపన

**కేటీదొడ్డి:** మండలంలోని ఇర్కిచేడులో సోమవారం వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఇందులో భాగంగా హోమం, మంత్రస్థాపన పూజలు వైభవంగా నిర్వహించారు. వాల్మీకి రచించిన రామాయణం ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిందని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మాధవి, శ్రీధర్, వాల్మీకి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### క్రీడలతో మానసికోల్లాసం

**కేటీదొడ్డి:** క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని రాష్ట్ర వినియోగదారుల కన్జ్యూమర్ ఫోరం చైర్మన్ గట్టు తిమ్మప్ప అన్నారు. సోమవారం మండలంలోని ఇర్కిచేడులో వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా ఏర్పాటు చేసిన కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో గట్టు జెడ్పీటీసీ శ్యామల, వాల్మీకి జిల్లా నాయకులు బాసు హనుమంతు, వీరుబాబు, కోటేష్, మురలి, డీలర్ జంగిలప్ప, ఆంజనేయులు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

### విజయవంతం చేయండి

**ధరూరు:** దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పాఠశాలల్లో నిర్వహించే విద్యా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎంఈఓ సురేష్, ఆయా పాఠశాల జీహెచ్‌ఎంలు ప్రతాప్‌రెడ్డి, నరేష్‌లు సోమవారం ఓ ప్రకటనలో కోరారు. ఉదయం 7.30 గంటలకు విద్యార్థులచే ర్యాలీలు, 9.30 గంటలకు జాతీయ జెండా ఆవిష్కరణ ఉంటుందని తెలిపారు. అలాగే 10.00 గంటల నుంచి 11.30 గంటల వరకు పాఠశాల ప్రగతి నివేదిక, విద్యార్థులకు సన్మానం, బహుమతులు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.



ముసలంపల్లిలో మొక్కలను నాటుతున్న జెడ్పీటీసీ, అధికారులు



శాంతినగర్‌లో మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ రవీంద్ర



అలంపూర్‌లో హరితోత్సవ ర్యాలీలో మున్సిపల్ చైర్‌పర్సన్



ర్యాలంపాడులో మొక్క నాటుతున్న వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

# ప్రతి పల్లెలో పచ్చదనం

- ఊరూరా హరితోత్సవాలు

**రాజోళి:** హరితహారం కార్యక్రమంతో ప్రతి పల్లెలో పచ్చదనం పరుచుకుందని అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా సోమవారం మండలంలోని తుమ్మిళ్లలో నిర్వహించిన హరితోత్సవంలో భాగంగా ఆయన మొక్కలు నాటారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ హరితహారంలో భాగంగా రోడ్లకు ఇరువైపులా, గ్రామాల్లో విరివిగా మొక్కలు నాటి గ్రామాలను హరిత వనాలుగా మార్చామని, దీంతో ఆహ్లాదకరమైన వాతావరణం తయారైందన్నారు.అనంతరం పల్లె ప్రకృతి వనాల్లో పని చేస్తున్న సిబ్బందిని శాలువా, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గోవిందురావు, వైస్ ఎంపీపీ రేణుక, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

**గద్వాల:** మున్సిపాలిటీ పరిధిలోని మెలచెర్వు క్రాస్ రోడ్డు దగ్గర ఏర్పాటు చేసిన హరితోత్సవంలో సోమవారం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి హాజరై మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, వైస్ చైర్మన్ బాబర్, మున్సిపల్ కమిషనర్ నర్సింహా, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



లింగన్‌వాయిలో మొక్క నాటుతున్న ఎంపీఓ చంద్రకళ, సర్పంచ్ రంజాన్‌బీ

**అయిజ:** మున్సిపాలిటీ పరిధిలోని రాయచూర్ రోడ్డు కొత్తచెరువు దగ్గర హరితోత్సవం సందర్భంగా నంబర్ 10 నంబర్ ఆకారంలో మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న, కమిషనర్ గోల్కొండ నర్సయ్య మొక్కలు నాటారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ రోడ్డులోని బురందొడ్డి కాలనీలో రెండు పట్టణ ప్రకృతి వనాలను చైర్మన్ ప్రారంభించారు. అదేవిధంగా పర్దిపురం డంపింగ్‌యార్డ్, ఎఫ్ఎస్‌టీపీ షెడ్డుకు అప్రోచ్ రోడ్డు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజినీర్ గోపాల్, మేనేజర్ రాజేష్, కౌన్సిలర్ శ్రీరాములు, పూజారి వెంకటేష్, చాకలి హుసేన్, నేష వెంకటేష్, ఉప్పరి చందు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

**అలంపూర్:** తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం హరితోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా మున్సిపాలిటీలోని జెడ్పీహెచ్ఎస్ న్యూప్లాట్స్, ఇమాంపురంలో నిర్వహించిన కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ, వైస్ చైర్మన్ శేఖర్ రెడ్డి, ఎంఈఓ అశోక్ కుమార్, కమిషనర్ నిత్యానంద్‌లు హాజరై మొక్కలు నాటారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. అనంతరం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో హరితహారంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వారికి మున్సిపల్ చైర్‌పర్సన్ బహుమతులు అందజేశారు. పల్లెల్లో పచ్చదనం పెంచేందుకు సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సరోజమ్మ, సుదర్శన్ గౌడ్, ఇంతియాజ్, ప్రధానోపాధ్యాయుడు నాయకులు మద్దిలేటి, దేవరాజు, మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

**అలంపూర్ రూరల్:** రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా సోమవారం హరితోత్సవం నిర్వహించారు. మండలంలోని లింగన్‌వాయిలో సర్పంచ్ రంజాబీతో కలిసి ఎంపీఓ చంద్రకళ మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీఎం పారిజాతం, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అదేవిధంగా మండలంలోని కాశపూర్ నర్సరీలో హరితోత్సవం నిర్వహించారు. ఎంపీడీఓ గోవిందరావు హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ రాములమ్మ, ఎంపీపీ పింజరి బేగం, ఎంపీఓ చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

**శాంతినగర్:** వడ్డేపల్లి మున్సిపాలిటీతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో హరితోత్సవం నిర్వహించారు. ఒక్కో గ్రామ పంచాయతీలో 120 మొక్కల చొప్పున ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వాచర్‌లను సన్మానించారు. హరితహారంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవీంద్ర, ఎంపీఓ తిరుపతన్న, మున్సిపల్ చైర్మన్ కరుణ, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉపాధిహామీ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



తుమ్మిళ్లలో పాల్గొన్న ఎమ్మెల్యే అబ్రహం

**గట్టు:** హరితహారంలో భాగంగా నాటిన ప్రతి మొక్కను సంరక్షించుకొని పల్లెలను పచ్చగా తీర్చిదిద్దుకుందామని జెడ్పీటీసీ బాసు శ్యామల కోరారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం ముసలంపల్లి ఫారెస్ట్ భూముల్లో 11 వేల మొక్కలను నాటే కార్యక్రమాన్ని డిప్యూటీ ఫారెస్టు రేంజర్ రాఘవేంద్ర, బీట్ అధికారిణి ప్రసూన, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మండల హనుమంతునాయుడు, ఎంపీడీఓ చెన్నయ్య, ఏపీఓ ప్రసాద్‌లతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో చమన్‌ఖాన్‌దొడ్డి సర్పంచ్ గోవిందమ్మ, బల్గెర ఎంపీటీసీ రూపవతి, కార్యదర్శి సురేష్, అంజి, ఉపాధి అధికారులు పాల్గొన్నారు.

**ధరూరు:** పర్యావరణాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని ర్యాలంపాడులో సర్పంచ్ కర్రెమ్మతో కలిసి ఆయన మొక్కలు నాటారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వసంత్, బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, మాజీ సర్పంచ్ దౌలన్న, నాయకులు తిమ్మప్ప, రంగారెడ్డి, బాలు, రంగన్న గౌడ్, లక్ష్మన్, నర్సింహులు, సురేష్, రాముడు తదితరులు పాల్గొన్నారు.

**మల్దకల్:** మండల కేంద్రంలో నిర్వహించిన హరితోత్సవంలో ఎంపీపీ రాజారెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి హాజరై మొక్కలు నాటారు. సర్పంచ్ యాకోబు, ఎంపీడీఓ కృష్ణయ్య, ఎంపీఓ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఈఓ మాబీ, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**మానవపాడు:** మండలంలోని కొర్విపాడులో హరితోత్సవం సందర్భంగా బృహత్ పల్లె ప్రకృతి వనంలో అధికారులు, ప్రజాప్రతినిధులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనువాసులు, ఏపీఎం కోటేశ్వరి, చెన్నకేశవులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

**ఉండవెల్లి:** మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో హరితోత్సవం భాగంగా ప్రిన్సిపాల్ పద్మలత ఆధ్వర్యంలో సర్పంచ్ రేఖ, మైనార్టీ గురుకుల కో ఆర్డినేటర్ హవీలా రాణి మొక్కలు నాటారు.



మానవపాడు మండలం కొర్విపాడులో..



మల్దకల్‌లో..



ఉండవెల్లిలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో..

## ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు



వడ్డేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఇటిక్యాలంలోని ఎర్రవల్లి చౌరస్తాలో పుస్తకాలను పంపిణీ చేస్తున్న నాయకులు

**శాంతినగర్:** కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా సోమవారం వడ్డేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులు, పేదలకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ జన్మదినం పురస్కరించుకుని వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మహిళా జిల్లా అధ్యక్షురాలు నాగశిరోమణి, నాయకులు రామకృష్ణారెడ్డి, రుక్మాంగదరెడ్డి, సుజాత, రామన్, మధు, రాజశేఖర్, జగన్, అశోక్, సుమంత్, ప్రేమరాజు, రాంబాబులు పాల్గొన్నారు.

**అయిజ:** రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా సోమవారం ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మధుకుమార్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ కార్యదర్శి షేక్షావలి ఆచారి, పార్టీ మండల అధ్యక్షుడు జయన్న, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి, ప్రధాన కార్యదర్శి సాంబశివుడు, జిల్లా ఉపాధ్యక్షుడు గాల్‌రెడ్డి, మైనర్‌బాబు, దేవేందర్, బస్వరాజు తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని ఉప్పల్‌క్యాంప్‌లో రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో గుడిసెల కర్రెన్న, మహేష్, రాజనందం, మల్దకల్, బల్లపరం జ్యోతి, దుబ్బన్న, లబ్బు తిమ్మప్ప, ఇస్మాయిల్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

**ఎర్రవల్లిచౌరస్తా:** ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి చౌరస్తాలో సోమవారం రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా అలంపూర్ యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జోగుల రవి ఆధ్వర్యంలో పదో బెటాలియన్‌లోని ప్రాథమిక పాఠశాల చిన్నారులకు పలకలు, పుస్తకాలు, పెన్నులను అందజేశారు. కార్యక్రమంలో వెంకటన్న, పరుశరామ్, వెంకటేష్, రామ్ ప్రసాద్, ఉపాధ్యాయులు ఉన్నారు.

## ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి

**గద్వాల అర్బన్:** జిల్లాలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సీఆర్‌పీఎఫ్ జిల్లా కన్వీనర్ తిప్పన్న, కో కన్వీనర్ సుధాకర్‌లు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవనంలో సీఆర్‌పీఎఫ్ కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. రాజోళి మండలంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ వల్లూరు క్రాంతి, డీఈఓ సిరాజుద్దీన్‌లకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి హనిమి రెడ్డి, సభ్యులు నర్సింహులు, ఆయా పార్టీల నాయకులు అతికూర్ రహమాన్, వెంకటస్వామి, ఆంజనేయులు, అలూరు ప్రకాష్ గౌడ్, ప్రజా సంఘాల నాయకులు వాల్మీకి, వినోద్, రాజు, దేవేందర్ తదితరులు ఉన్నారు.



నినాదాలు చేస్తున్న నాయకులు

## త్రైత సిద్ధాంత గ్రంథాలను చదవాలి



భగవద్గీత పుస్తకాలను ప్రదర్శిస్తున్న నిర్వాహకులు, ప్రజలు

**శాంతినగర్:** ప్రతి ఒక్కరు త్రైత సిద్ధాంత గ్రంథాలను చదవాలని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక బింగిదొడ్డి కమిటీ అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు. సోమవారం వడ్డేపల్లి మండలంలోని జిల్లెడుదిన్నె లో త్రైత సిద్ధాంత భగవద్గీత, సాంద్ర సింధువేదం సారాంశ గ్రంథాల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరి రచించిన ఆధ్యాత్మిక గ్రంథాలు ఎంతో గొప్పవన్నారు. ఆత్మశక్తి గురించి అవగాహన ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈరన్న, వెంకటేష్, రామచంద్ర, జయమ్మ, నర్సమ్మ, పద్మమ్మ, జమ్ములమ్మలు పాల్గొన్నారు.

### ఇసుక టిప్పర్ పట్టివేత

**గద్వాల క్రైం:** అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ఇసుక టిప్పర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ ఆనంద్ తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం ఇటిక్యాల మండలం కొండపురం గ్రామానికి చెందిన మహేందర్‌గౌడ్ సోమవారం తెల్లవారు జామున కృష్ణానది నుంచి ఎర్రవల్లి, గద్వాల మీదుగా ఇసుకను టిప్పర్ ద్వారా అక్రమంగా తరలిస్తున్నాడు. అందుకున్న సమాచారం మేరకు జమ్మిచెడ్ శివారు వద్ద టిప్పర్‌ను పోలీసులు పట్టుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

### లారీ, బొలెరో ఢీ: వ్యక్తికి గాయాలు

**ఎర్రవల్లిచౌరస్తా:** ఎదురెదురుగా లారీ, బొలెరో ఢీకొని వ్యక్తికి గాయాలైన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గద్వాల మండలంలోని పూడూర్ గ్రామానికి చెందిన పరుశరాముడు తన బొలెరో వాహనంతో ఎర్రవల్లి వైపు వెళ్తున్నాడు. ఎర్రవల్లి నుంచి గద్వాల వైపు వెళ్తున్న లారీ ప్రమాదవశాత్తు నంది గోశాల సమీపంలో బొలెరో వాహనాన్ని ఢీకొన్నది. ఈ ఘటనలో బొలెరో డ్రైవర్ పరుశరాముడుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం క్షతగాత్రుడిని గద్వాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

### కేసు నమోదు

**కేటీదొడ్డి:** మండలంలోని ఉమిత్యాలతండాలోని ఆబ్కారీ ఎస్ఐ రాజేందర్ ఆధ్వర్యంలోని పోలీసులు దాడులు నిర్వహించారు. గ్రామస్తుడు శంకర్ నాయక్ ఇంట్లో రెండు లీటర్ల సారా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఆబ్కారీ సీఐ గోపాల్ తెలిపారు. ఎవరైనా సారా తయారు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

### రేషన్ కార్డు లేక అవస్థలు



**గద్వాల అర్బన్:** రేషన్ కార్డు లేక పేదలు సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారని బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారి రాజు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రేషన్ కార్డు లేని వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. కుల వృత్తులకు రూ.లక్ష కేటాయించిన ప్రభుత్వం.. దరఖాస్తుదారులు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టు తిరగాల్సిన పరిస్థితి నెలకొందని, రేషన్ కార్డులు లేని పేదలు నానా అవస్థలు పడుతున్నారన్నారు. రేషన్ కార్డుల దరఖాస్తుకు నోటిఫికేషన్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు మునీ, ప్రకాష్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ

**మల్దకల్:** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ప్రిన్సిపాల్ రమేష్ లింగం ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఒక్కొక్క విద్యార్థికి రూ.2500 విలువ చేసే పుస్తకాలను అందజేస్తుందన్నారు. విద్యార్థులు లక్ష్యంతో చదువుకొని ఉన్నతంగా ఎదగాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామాంజనేయులుగౌడ్, నర్సింహులు, గోవర్ధన్ శెట్టి, శ్రీనాథ్, భాగ్యలక్ష్మి, జయరాం పాల్గొన్నారు.



మల్దకల్‌లో ఉచిత పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్ రమేష్‌లింగం

## నిర్వాసితులకు ఇళ్ల స్థలాలు ఇవ్వండి



అలంపూర్‌లో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ముంపు బాధితులు

**అలంపూర్:** వరద కారణంగా ముంపునకు గురైన నిర్వాసితులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని బాధితులు మున్సిపాలిటీలోని 3,4 వార్డులోని కాలనీ ప్రజలు తహసీల్దార్ సుభాష్ నాయుడుకు వినతిపత్రం అందజేశారు. సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో అధికారిని కలిశారు. 2009లో వచ్చిన వరదల్లో ముంపునకు గురయ్యామని నదికి పక్కనే ఉండటంతో అధికంగా నష్టపోయామని వివరించారు. 2007లో లోతట్టు ప్రాంతంలో ఉన్న తమ కాలనీ ముంపునకు గురైందని అప్పుడు కూడా న్యాయం చేయలేదని పేర్కొన్నారు. వరదల్లో తీవ్రంగా నష్టపోయిన తమకు ఇళ్ల స్థలాలు కేటాయించి న్యాయం చేయాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో కౌన్సిలర్ సుదర్శన్ గౌడ్, కాలనీవాసులు చిన్న బీసన్న, వెంకట్రాముడు, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

## పల్లెల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

**ఎర్రవల్లిచౌరస్తా:** పల్లెల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని అలంపూర్ ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం అన్నారు. సోమవారం ఇటిక్యాల మండల కేంద్రం నుంచి ఉదండాపురం వరకు రూ. 3.2 కోట్ల వ్యయంతో 5.3 కిలోమీటర్ల మేర చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను నాణ్యతతో చేపట్టి సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ప్రతి గ్రామంలో కూడా ఆహ్లాదకరమైన వాతావరణం కోసం పల్లె ప్రకృతి వనాలను, నర్సరీలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి గ్రామానికి బీటీ రోడ్లతో పాటు అంతర్గత రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. అనంతరం ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యేకు పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు కొప్పుల లక్ష్మీనారాయణరెడ్డి, సుధాకర్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, ఆయా శాఖల అధికారులు, ప్రజలు, తదితరులు ఉన్నారు.

## ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

**అలంపూర్ రూరల్ :** 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని ఎంపీఓ చంద్రకళ అన్నారు. మండలంలోని లింగన్‌వాయిలో సోమవారం గ్రామసభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీఓ మాట్లాడుతూ ఓటరు నమోదుపై గ్రామస్తులకు బీఎల్‌ఓలు అవగాహన కల్పించాలన్నారు. ఓటరు జాబితాలో తప్పులు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రంజాన్‌బీ, ఏపీఎం పారిజాతం, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరి, గ్రామస్తులు పాల్గొన్నారు.

**ధరూరు:** ఓటు నమోదును సద్వినియోగం చేసుకోవాలని వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. సోమవారం ర్యాలంపాడులో ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. గ్రామంలో చాటింపు వేయించాలని సర్పంచ్ కర్రెమ్మకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వసంత్, బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, మాజీ సర్పంచ్‌లు దౌలన్న, అంపన్న, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీఓ చంద్రకళ

**శాంతినగర్:** ఈనెల 23వ తేదీలోగా ఓటు నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ రవీంద్ర, ఇన్‌చార్జ్ తహసీల్దార్ వేణుగోపాల్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫారం 6లో దరఖాస్తు చేసుకుని గ్రామాల్లోని బూత్‌లెవల్ ఆఫీసర్లకు సమర్పించాలని కోరారు. ఆన్‌లైన్‌లో కూడా ఓటర్‌కార్డు కొరకు దరఖాస్తు చేసుకోవచ్చని వారు సూచించారు.